

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు

-నకిలీ కంపెనీలతో జాగ్రత్త...ప్రతిదానికి బిల్లులు తీసుకోండి
-వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఈనెలలో మగశిర కార్తె ప్రారంభమవడంతో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వాగులు, వంకలు, చెక్‌డ్యాములకు జలకళ వచ్చింది. అన్నదాతలు సాగుకు సన్నద్ధమయ్యారు. వ్యవసాయ పనుల్లో పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అన్ని అనుకూలిస్తే మరో 20 రోజుల్లోనే విత్తనం నాటే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలోనే నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదోని మండల వ్యవసాయ అధికారి అశోక్ కుమార్ రెడ్డి సూచించారు. లేకపోతే పంటతో పాటు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా ఖరీఫ్‌లో వేరుశనగ, శనగ, కంది, సజ్జ, జొన్న, పత్తి పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తుగా ప్రకటించింది. సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాశాఖ అంచనాకు వచ్చింది. ప్రభుత్వం అందించే రాయితీ విత్తనానికి తోడు ప్రైవేటు షాపుల్లోనూ అనేక రకాల విత్తనాలను రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడులు వచ్చే విత్తన కంపెనీలు ఉన్నాయని, వాటిని కొనుగోలు చేసి తీసుకెళ్లేలా జోరుగా ప్రచారం చేస్తున్నారు. నకిలీ విత్తనాల బారినపడి ఏటా రైతన్నలు అధిక సంఖ్యలో నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో కొనుగోలు సమయంలో అన్నదాతలు తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలిలా...

వ్యవసాయశాఖ ద్వారా లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి. లూజుగా ఉన్న సంచులు,పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనకూడదు. విత్తన ప్యాకెట్, సీసా,సంచి,డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి. విత్తనాలు కొనుగోలుకు సంబంధించిన బిల్లును పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలి. మొలకెత్తే



దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి. ఎరువులు కొనే ముందు. అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో గమనించాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి. చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనకూడదు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి. కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయాధికారి సహకారంతో ఎరువులను పరీక్షించుకోవాలి. పురుగు మందు కొనే ముందు. వ్యవసాయ,ఉద్యానశాఖ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందు కొనుగోలు చేయాలి. పురుగు మందు డబ్బాపై డైమండ్ ఆకారంలో పురుగు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి. పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి. పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించకూడదు.

నాణ్యమైన విత్తనాలనే కొనాలి: మండల వ్యవసాయఅధికారి అశోక్ కుమార్ రెడ్డి



నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలి. పోలీసులకు కూడా ఫిర్యాదు చేయొచ్చు.విత్తనాల్లో నాణ్యత లేక దిగుబడి కోల్పోయినట్లు గమనిస్తే సదరు విత్తన కంపెనీపై వ్యవసాయాధికారి ద్వారా జిల్లా అధికారికి ఫిర్యాదు చేయించి తగిన పరిహారం పొందవచ్చు. రైతులు సంబంధిత బిల్లులను భద్రంగా ఎత్తిపెట్టుకోవాలి. ఇటీవల అన్నీ దుకాణాల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టాం.నాణ్యతలేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు చేపడతామని దుకాణదారులకు హెచ్చరికలు జారీచేశాం

టిడిపి కార్యకర్త దారుణ హత్య

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం టిడిపి కార్యకర్త గిరి(35)ని వైసిపి కార్యకర్తలు వేటకొడవళ్లతో నరికి హత్య చేశారు. గ్రామంలో పోలింగు రోజు వైసిపి ,టిడిపి నాయకుల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. వైసిపి కార్యకర్తలను టిడిపి కార్యకర్తలను కొట్టారు. ఈ లోపు పోలీసులు వచ్చి చెదరగొట్టారు. ఆదివారం సాయంత్రం గిరి తన సోదరునితో కలిసి



చంద్రబాబునాయుడుతో గిరి (ఫైల్ ఫొటో)

వైసిపి నాయకుడు రమేష్ ఇంటివైపు వెళ్లారు. ఎందుకు వచ్చారని మాటామాటా పెరిగి గొడవ పెద్దదయింది. రమేష్ అనుచరులు ఐదారుగురు కలిసి గిరి, ఆయన సోదరునిపై వేటకొడవళ్లతో దాడి చేశారు. గిరికి బలమైన గాయాలయ్యాయి. ఆయన సోదరుడు స్వల్ప గాయాలతో తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెల్దుర్తి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని పోగా చనిపోయినట్లు డాక్టర్లు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న సిఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ పి.చంద్రశేఖర్ రెడ్డి బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హత్యకు కారకులైన వారి వివరాలు తెలుసుకొని అరెస్టు చేస్తామని తెలిపారు. రాత్రి సంఘటనా స్థలాన్ని ఎస్‌పి జి.కృష్ణకాంత్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తతలు తావివ్వకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

-వైద్య సిబ్బంది సమయపాలన తప్పనిసరి పాటించాలి
-ప్రజాశక్తితో జిజిహెచ్ సూపరిన్‌టెండెంట్ డాక్టర్ చింత ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆస్పత్రి ప్రతిష్టను పెంచుతాం. ఇందులో విధులు నిర్వహించే వైద్యులు, పారా మెడికల్, శానిటేషన్ తదితర సిబ్బంది అందరూ ప్రభుత్వం నిర్దేశించిన సమయాన్ని పాటించాలి. అప్పడే ఏరోజు చేయాల్సిన పని ఆ రోజే పూర్తి అవుతుంది. ఆస్పత్రిలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉంది. వాటిని అమలు చేసేందుకు తాము సంసిద్ధం అని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిన్‌టెండెంట్ డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వెల్లడించిన వివరాలు.....

జిజిహెచ్ పర్యవేక్షకునిగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఇన్చార్జి పర్యవేక్షకునిగా విధులు నిర్వహించారు తేడా ఎలా ఉంది?

ప్రభాకర్‌రెడ్డి: ఆస్పత్రి సూపరిన్‌టెన్‌డెంట్‌గా విధులు నిర్వహించడం చాలా బాధ్యతతో కూడినది. ఆసుపత్రికి కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమ, కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాదిమంది రోగులు వారి బంధువులు వస్తుంటారు. ఒపి తీసుకుని వ్యాధులు చూయించుకునేందుకు వచ్చేవారు కొందరు అయితే మరికొందరు ఆసుపత్రిలో చేరి వ్యాధులను నయం చేసుకునేందుకు వస్తుంటారు. వారికి తోడుగా వారి బంధుమిత్రులు ఉంటారు. వీరందరికి ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని రకాల వైద్య చికిత్సతో పాటు సేవలను అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇన్‌ఛార్జిసూపరిన్‌టెన్‌డెంట్‌గా తక్కువ బాధ్యతలు ఉంటాయి. శాశ్వత ప్రమాణాలు కలిగిన సేవలు అందించే వీలు ఉండదు. పూర్తి బాధ్యతలతో సూపరిన్‌టెన్‌డెంట్‌గా ప్రజలకు సంపూర్ణ సేవలు అందించే వీలుంది.

వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి ఆయారాం గయారామ్ అన్నట్టుగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి దీనిపై మీ స్పందన?

ప్రభాకర్‌రెడ్డి: ఆసుపత్రిలో విధులు నిర్వహించే వైద్యులు పారామెడికల్ సిబ్బంది శానిటేషన్ తదితర సిబ్బంది ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వహించాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వైద్యులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు. సిబ్బంది ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు ఇతర సిబ్బంది వారి వారి సిఫ్టుల సమయం ప్రకారం విధులు నిర్వహించాలి. విధి నిర్వహణలో సమయపాలన పాటించాలి. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటాం. సమయపాలన పాటించడం వలన ఏ రోజు పని ఆ రోజు పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. పెండింగ్ ఫైల్స్ అనేవి ఉండవు.

ఒపి విభాగంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను ఎలా పరిష్కరిస్తారు?.

ప్రభాకర్‌రెడ్డి: ఆసుపత్రికి రోగులు అధిక సంఖ్యలో వస్తుండటంతో ప్రస్తుతం ఉన్న కౌంటర్ల వద్ద రద్దీగా ఉంది. సమస్యను అధిగమించేందుకు అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఏర్పడుతున్న అసౌకర్యాన్ని తొలగిస్తాం. ప్రస్తుతం ఈ-డిజిటల్ కౌంటర్ ను ప్రారంభించి సేవలు అందిస్తున్నాం. దీంతో రోగులు త్వరగా మెరుగైన సేవలు పొందేందుకు వీలు ఏర్పడింది.

క్యాజువాలిటీ వెళ్లే దారి పక్కనే ఫార్మసీ కౌంటర్ ఉండటం వల్ల రోగుల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఉంది దీన్ని ఎలా పరిష్కరిస్తారు?

ప్రభాకర్‌రెడ్డి: క్యాజువాలిటీకి వచ్చే రోగులు ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న మాట వాస్తవమే ఫార్మసీ కౌంటర్ వద్ద మందులు తీసుకునేందుకు ప్రజలు బారులు తీరి ఉంటారు. ఈ సమస్యను అధిగమించేందుకు త్వరలో ఫార్మసీ కౌంటర్‌ను మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఎదురుగా ఉన్న భవనంలోకి ఫార్మసీ కౌంటర్‌ను తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటాం

ఆసుపత్రిలో ఎంఎంసి వార్డులో బెడ్ల సంఖ్య తక్కువగా ఉండటంతో రోగులకు వైద్య చికిత్సలు సరిగా అందడం లేదు దీనిపై మీ స్పందన?

ప్రభాకర్‌రెడ్డి: ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య అధికంగా ఉండటంతో ఎఎంసిలో చేరుతున్న రోగుల సంఖ్య కూడా పెరుగుతుంది. దీనికి తగినట్టుగా ఎఎంసి వార్డులో బెడ్ల సంఖ్య లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బెడ్ల సంఖ్యను పెంచేందుకు దృషి చేస్తాం.

ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా , జనరేటర్ల వినియోగం ఎలా ఉంది?

ప్రభాకర్‌రెడ్డి: ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా అన్ని భవనాలకు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుంది. ప్రస్తుతం రిపేరీలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌పార్మర్లకు రూ.నాలుగు లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించాం. మూడు జనరేటర్లకు సర్వీసింగ్ చేయించి సిద్ధంగా ఉంచుతున్నాం. ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా వార్డులకు ఆపరేషన్ థియేటర్లకు విద్యుత్తు నిత్యం సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

ముఖా ముఖి

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాలలలో కర్నూలు విజేతగా శ్రీ చైతన్య విద్యాసంస్థలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అడ్వాన్స్‌డ్ ఫలితాలలో కర్నూలు శ్రీ చైతన్య విద్యార్థులు ఆలిండియా స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారని ఎజిఎం మురళీకృష్ణ తెలిపారు. వారిలో కె.హర్షవర్ధన్ ఆలిండియా స్థాయిలో42వ ర్యాంకు, కె.శివనారాయణ 51వ ర్యాంకు, పి.ప్రనీత్‌రెడ్డి 345వ ర్యాంకు, డి.నోయల్‌నయ్ 1538వ ర్యాంకు, ఎ.దీపక్ కుమార్ 6938వ ర్యాంకు, బి.సుజిత్ కుమార్ 7609వ ర్యాంకు, పిఉమాలికేశ్ 15678వ ర్యాంకులు సాధించారు. దేశంలో ఇంజనీరింగులో ప్రతిష్టాత్మకమైన ఐఐటి, ఎన్ఐటి, త్రిపుల్ ఐటి, జిఎఫ్‌టిఐ లాంటి విద్యాసంస్థలలో చాలా మంది విద్యార్థులు ఎంపికవుతారని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శ్రీ చైతన్య కళాశాళల ఎజిఎం మురళీకృష్ణ, డీన్‌లు సరళ , బాలాజీ అభినందించారు.



పార్వతమ్మ సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి కార్యకర్తలు

టిడిపిలోకి వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం వీకర్ సెక్షన్ కాలనీలోని నరసింహ, వాసు మాబాషా, అనిల్ తో పాటు 50 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపి నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ సమక్షంలో టిడిపిలో చేరారు. వీరిని పార్వతమ్మ టిడిపి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి ఎలాంటి గొడవలు లేకుండా అందరూ సోదరభావంతో కలిసి కట్టుగా ఉండి మన కాలనీలోని సమస్యలను పరిష్కరించుకుందామని అన్నారు.



పోలకల్‌లో వృథాగా బ్రిటీస్ కాలంనాటి ఉక్కు రోలరు

ప్రదర్శనశాలకు తరలించాలని పలువురు వ్యక్తం

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండలం పోలకల్‌లో బ్రిటిష్ కాలం నాటి ఉక్కుతో గల రోడ్డు రోలరు ఏళ్లుగా వథాగా పడిఉంది. ఈ రోలరు సుమారు 30 నుండి 40 క్వింటాల బరువు ఉంటుందని తెలుస్తోంది. ఇది పోలకల్‌లో పెద్ద చర్చికి సమీపంలో దళిత కాలనీ రోడ్డులో ప్రక్కకు ఉండటంతో అటుగా వెళ్తున్న వారిని ఆకర్షిస్తుంది. ఇది మూడు అడుగుల వెడల్పులో గుండ్రంగా ఉండి పొడవు ఐదు అడుగుల మేర ఉంటుందని ఇప్పటికి అదీ తుప్పు పట్టక పోవడం ఆశ్చర్యంగా ఉందని పలువురు భావిస్తున్నారు. ఏది ఏమైనా అధికారులు ప్రదర్శనశాలకు తరలిస్తే విహారయాత్రికులను మరింత ఆకట్టుకుంటుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

విత్తన విక్రయాల్లో నకిలీ బిల్లు - రైతన్న జేబుకు చిల్లు

ఎరువుల,మందుల,విత్తన దుకాణాదారుల మాయలు
అధికారుల అలసత్వంతో వ్యవహారం

ప్రజాశక్తి-పత్తికొండ : చినుకు పడితే చాలు విత్తన దుకాణాల్లో నకిలీ బిల్లులు – రైతున్న జేబులు చిల్లులు పెట్టడం దుకాణాదారులకు అలవాటుగా మారింది. విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేయుటలో ఏది నకిలీ, ఏది ఒరిజినల్, కొంతమంది అమాయక రైతులకు తెలియని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా వ్యవసాయం తప్ప మరే వృత్తి ఎరుగని రైతన్నలు వర్షాలు పడి కాలం కలిసి వస్తుందంటే పొలాల్లో పంటలు సాగు చేసేందుకు నిమగ్నమవుతుంటారు. పత్తికొండలో ఇందుకు నిదర్శనంగా ఎరువుల, మందుల, విత్తన దుకాణాదారుల మాయలతో యథేచ్ఛగా నకిలీ బిల్లులు, రసీదులు ఇటీవల వెలుగు చూస్తున్నాయి. ఓ విత్తన దుకాణంలో నకిలీ బిల్లులతో పాటు కొనుగోలు చేసిన రైతు పేరు అర్థం కానీ స్థితిలో ప్రైవేట్ వైద్యులు రోగులకు మందులు రాసిచ్చినట్టుగా ఉన్న రసీదు మాయలు మండలంలో చక్కర్లు కొడుతోంది. సంబందించిన అధికారులు ఏఓ, ఏడిఏలకు తెలిసి కూడా పట్టించుకున్న పాపానలేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 25 దుకాణాలున్నాయి. కొన్ని దుకాణాలలో మాత్రం అడిగేవారు లేరని ధరల నిబంధనలకు తూట్లు పొడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడే పర్యవేక్షణ చేపట్టాల్సిన వ్యవసాయఅధికారుల లోపం కనబడుతోంది. నామమాత్రంగా తనిఖీల ఫలితంగా పలు దుకాణాల్లో స్టాకు బోర్డు, ధరల పట్టిక, రైతులకు ఇచ్చే బిల్లుల రికార్డులు వంటివి పాటించడంలో ఇష్టారాజ్యమైందని సమాచారం. మరోకోణంలో దుకాణదారులతో అధికారులు కుమ్మక్కయి మామూళ్ళ మత్తులో తుగూతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతున్నల పట్ల ఇప్పటికైనా అధికారులు తగు శ్రద్ధచూపి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.



GSTIN : 37AAOPI0989C1ZI
F.L. No. KNL/51/ADA/FR/2014/10983
S.L. No. KNL/51/JDA/SD/2017/13390
P.L. No. 3814
CASH / CREDIT BILL
Cell : 9948023789
9440024468
శ్రీ లక్ష్మినరసింహ ఫర్టిలైజర్స్
ప్రొ. యిల్లూరు నాగరాజు,
ఎరువులు, పురుగుమందులు & విత్తనముల వ్యాపారం,
H.No. 20/53, మెయిన్ రోడ్డు, పత్తికొండ (కర్నూలు జిల్లా)
నం. 23 తేది 3/6/24
రైతు పేరు : [illegible]
అడ్రస్ : [illegible]

Particulars	Pack	Qty	Rate	Amount
[illegible]	[illegible]	4	[illegible]	2600

రైతుపేరు స్పష్టంగా లేని బిల్లు



సలీంఖాన్ భవన్‌లో ఎస్‌టియు జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఘనంగా ఎస్‌టియు ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎస్‌టియు78వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగరంలోని స్థానిక సలంఖాన్ భవనంలో ఎస్‌టియు జండా ఆవిష్కరణను జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టికె.జనార్దన్ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు సుంకన్న రాష్ట్ర పూర్వ కార్యదర్శి షఫీ, సిటీ యూనిట్ రాముడు లు పాల్గొని మాట్లాడారు. విద్యా ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం నాయకులుగా మన మందరం త్యాగాలకు సిద్ధం కావాలన్నారు. కొత్తగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ ,కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. పాత పెన్షన్ అమలు చేయాలని, ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన జిఒ నెంబర్ 117 రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహమ్మద్ షఫీ, శేఖర్, సుధీర్, పాలయ్య, రాముడు, సురేష్, గోవిందనాయక్ , తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'నారాయణ' ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలో కర్నూలు నారాయణ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు డిజిఎం టి.గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. ఆదివారం కర్నూలు నారాయణ కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నారాయణ కళాశాలల నుండి వివిధ క్యాటగిరీలో జి. త్రిష 176 ర్యాంకు, జి. సర్వజిత్ 251 ర్యాంకు, షాహెద్దఖాన్ 278 ర్యాంకు, సాకేత్ సాయి మణికంఠ 1237 ర్యాంకు, టి. శ్రీహిత 1247 ర్యాంకు, ఎమ్. రాజశేఖర్ 1277 ర్యాంకు, ఎమ్. లాస్య 1801 ర్యాంకులు సాధించారన్నారు.500 లోపు ముగ్గురు, 2,000లోపు ఏడుగురు, 5,000 లోపు 15 మందికి ర్యాంకులు వచ్చాయన్నారు. ఇలా చాలా ర్యాంకులను కైవసం చేసుకోవడంలో నారాయణ విద్యాసంస్థలు మరోసారి విజయకేతనాన్ని ఎగరవేశారన్నారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో షాహెర్ అలిఖాన్ 2797 ర్యాంకు, ఎస్. సాకేత్ రామ్ 3414 ర్యాంకు, బి. వేదవ్యాస్ 3966 ర్యాంకు, ఎమ్. లాస్య 8413 ర్యాంకు, సాకేత్ సాయి మణికంఠ 9635 ర్యాంకు, జి. సర్వజిత్ 10010 ర్యాంకు, ఎమ్.థానుజ్ సాయి 11090ర్యాంకు, టి.ప్రణిత 17920 ర్యాంకు, ఎ. జశ్వంత్ 20865 ర్యాంకు, బి. గౌతమ్ సాయి 21454 ర్యాంకు, జి. యోగానంద్ 21890 ర్యాంకు, జి.త్రిష 23443 ర్యాంకు, ఆర్.సాయి అభినయ్ 20041ఆల్ ఇండియా ర్యాంకులు పొందినట్లు పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరిలో 5000 లోపు ముగ్గురు, 10,000 లోపు ఐదుగురు, 20,000 లోపు 8 మంది, 25,000 లోపు 13 మందికి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో , డీన్ లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ప్రిన్సిపల్స్ వేణు గోపాల్ రెడ్డి, జయరామి రెడ్డి, సాంబ శివా రెడ్డి అధ్యాపకులు , విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులలో డీన్‌లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం పొంచి ఉంది మ్యాన్‌హోళ్లను త్వరగా మూయించండని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఉండే 11వ వార్డు ఎర్ర బురుజులో, వరుసగా వినాయక గుడి వెనక వైపున, కల్వర్టులు నిర్మించారు. అయితే కల్వర్టులలో మ్యాన్‌హోళ్లు గత రెండు మూడు నెలలుగా తెరుచుకొని ఉండడంతో ఇక్కడి ప్రజలకు, రాకపోక వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకొని నగరపాలక సంస్థ కమిషనర్ పాలక మండలి స్పందించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మొహమ్మద్ షరీఫ్ ,పార్టీ నగర కమిటీ సభ్యులు ఎస్‌డి ఖాజాపాష, రవికుమార్ లు నగరపాలక సంస్థ కమిషనర్‌ను కోరారు. ఎన్నికల కౌంటింగ్ అయిపోయి వారం అవుతున్నప్పటికీ, ఏమాత్రం శ్రద్ధ చూపలేదని పేర్కొన్నారు. ద్విచక్ర, త్రీచక్ర వాహన చోదకులు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదన్నారు. ఒక్క క్షణం ఆజాగ్రత్త అయితే కాళ్లు, చేతులు విరిగి తల పగిలి చివరికి ప్రాణం పోయే ప్రమాదం కూడా ఉందని వివరించారు. రెండేళ్లకోసారి ఈ మ్యాన్ హోల్స్ లో విరిగి పోవడం ,తెగిపోవడం అనేది జరుగుతుంది. నాసిరకం వస్తువులను వాడడం వల్ల ఈ రకంగా ప్రజాధనాన్ని




నగరపాలక సంస్థ అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో వినాయక టెంపుల్ వెనక బాగాన ఉన్న కల్వర్టులకు మ్యాన్‌మ్యాహోల్ వెంటనే బిగించి ప్రజలకు మేలు చేకూర్చాలన్నారు. పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఉద్యమాలు, ఆందోళనలు, చేస్తామని హెచ్చరించారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో చిన్నటేకూరు గురుకుల ఐఐటి మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ రామ సుబ్బారెడ్డి ఆదివారం వెల్లడించారు. జెఇఇ నీట్ ప్రవేశ పరీక్షలకు రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ తో పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు.ఈ అకాడమీలో 2022-24 సంవత్సరంలో శిక్షణ పొందిన 61మంది విద్యార్థులు అడ్వాన్స్ పరీక్ష రాయగా వి.సంతోష్ ఆల్ ఇండియా కాటగిరి 817ర్యాంక్ సాదించారన్నారు. వారితో పాటు మొత్తం ఏడుగురు విద్యార్థులు 3000రోపు ర్యాంకు సాదించరన్నారు. అత్యధిక పర్సెంటైల్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, అంకిత భావంతో కృషిచేసిన ఉపాధ్యాయ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు.



గౌరు దంపతులను అభినందిస్తున్న కురువ సంఘం నాయకులు

గౌరు చరితకు కురువ సంఘం శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన గౌరుచరితను కర్నూలు జిల్లా కురువ సంఘం నేతలు ఆదివారం అమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ, జిల్లా కోశాధికారి కెసి.నాగన్న, జిల్లా నాయకులు బిసి. తిరుపాలు, పెద్దపాడు పుల్లన్న, నగర అధ్యక్ష ,కార్యదర్శి తవుడు శ్రీనివాసులు, బి.రామకృష్ణ, హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ కార్మికులకు ఉచిత ఇసుక అందించాలి

-నూతన ప్రభుత్వానికి సిఐటియు విజ్ఞప్తి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

రాష్ట్రంలో నూతనంగా కొలువు దీరుతున్న టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి భవణ నిర్మాణ కార్మికులతో పాటు ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్న 22 రకాల కార్మికులను ఆదుకోవాలని ఎమ్మిగనూరు మండల సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు సి. గోవిందు,బి.రాముడు కోరారు. ఆదివారం ఎమ్మిగనూరు సిఐటియు కార్యాలయంలో ఎమ్మిగనూరు ఎపి బిల్డింగ్ అండ్ అదర్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం డి.ఉస్మాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందు ,రాముడు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల భవన కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయన్నారు. ఇసుక విధానం వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి వలస వెళ్లారని తెలిపారు. అక్కడ అనేక మంది ప్రమాదాలను గురై ప్రాణాలు కోల్పోయారన్నారు. అటువంటి దుస్థితి లేకుండా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక శాఖలో అమలవుతున్న పతకాలను రద్దు చేసి కార్మికుల జీవన ప్రమాణాలును దిగజార్చారన్నారు. ఉచిత ఇసుక పాలసీతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఎపి భవన అండ్ ఇతర నిర్మాణ కార్మికుల యూనియన్ నాయకులు పి. లాలుసాబ్, తిమ్మప్ప, యు.వేంకటేశ్వర్లు, రమేష్ ,సాలేసాబ్, తిమ్మారెడ్డి, ఉరుకుందు, నరసప్ప, దాదావలి ,మధు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో తీర్మానం చేస్తున్న సిఐటియు నాయకులు

తుంగభద్రలో జల కళ

ప్రజాశక్తి-కౌతాళం

చాలా రోజుల తర్వాత తుంగభద్ర నదిలో జల కళ సంతరించుకుంది. మొన్నటివరకు ఎడారిని తలపిస్తున్న తుంగ భద్ర నది నేడు వర్షపు నీటితో ప్రవహిస్తున్నది. ఆంధ్ర సరిహద్దు కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేలిగనూరు గ్రామం వద్ద నుండి ప్రవహిస్తున్నది. కర్ణాటకలోని బళ్లారి, సిరుగుప్ప, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు తుంగభద్ర నదికి చేరుకుంటున్నాయి. తుంగభద్ర నది నీటితో ప్రవహిస్తుండటంతో నది తీర గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నదిలో నీటి ప్రవాహం ఉంటే నది తీర గ్రామాలైన మేలిగనూర్, నదిచాగి కుంభలనూర్, మురళి, గుడి కంబాలి, వల్లూరు నది తీర గ్రామ రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయంతో పాటు అనేక గ్రామాలకు తాగునీరు అందుతున్నాయి. సుమారు 40 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు తెలుస్తుంది.


ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు కౌతాళం మండలం మేలిగనూరు వద్ద తుంగభద్ర ప్రవాహం

ఘనంగా ఎస్‌టియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ఆదోని

ఆదోనిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా నాయకులు పి.నాగేంద్రప్ప అధ్యక్షతన ఎస్‌టియు 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వి.రమేష్ నాయుడు హాజరయి ఎస్‌టియు జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రయోజనాలను, ప్రభుత్వ విద్యను పరిరక్షిస్తూ తొలి పిఆర్‌సి నుండి అకుంటిత దీక్షతో అప్రెంటీస్ వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందించిన సంఘమని కొనియారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు లోక్య నాయక్, జి.వీరచంద్ర యాదవ్, రవి, భీమరాజ్, శ్రీనివాసులు, తిమ్మప్ప, అయ్యప్ప, హనుమన్న, నారాయణ, జ్యోతి మూర్తి, ప్రసాద్, ఉరుకుందప్ప, రాముడు, శ్రీనివాసులు, కాశీ విశ్వనాథ్, జంబులయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌టియు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

ఆదోని ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలి

ప్రజాశక్తి-ఆదోని

వర్షాధారం పైనే వ్యవసాయం సాగవుతుందని, ఈ ప్రాంతంలో ఉపాధి లేక వలసలు వెళుతున్నారని వలసలను అరికట్టేందుకు సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం పశ్చిమ ప్రాంతమైన ఆదోని నియోజకవర్గం అభివృద్ధిలో అత్యంత వెనుకబడి ఉందన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కూటమిలో భాగంగా బిజెపి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధికి క్యాబినెట్లో మంత్రి పదవి చోటు దక్కించే విధంగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత రామోజీరావు మీడియా, సినీ రంగానికి వన్నెతెచ్చిన ఘనత ఆయనకి దక్కిందన్నారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి నారా చంద్రబాబు నాయుడు అవసరం ఎంతైనా ఉందని, విభజన అనంతరం నష్టపోయిన ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించి నిధులు, నియమాలు, నీళ్ల అవసరమైన మేరకు కేటాయించి ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదోని నియోజకవర్గం గతంలో రెండవ ముంబాయిగా పేరుగాంచిందని, ఈప్రాంతంలో ఇప్పటివరకు ఏ ఒక్క పార్టీ కూడా మంత్రి పదవి ఇవ్వలేదని, అభివృద్ధిని దష్టిలో ఉంచుకుని మంత్రి పదవి కేటాయించాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పక్కనే వెళుతున్న తుంగభద్ర నది ద్వారా తాగు, సాగునీరు సక్రమంగా అందడం లేదని, ప్రాజెక్టులు ఏర్పాటు చేసి సంపూర్ణమైన నీటి సదుపాయం కల్పించి ఆదోని అభివృద్ధికి పరిశ్రమలు తీసుకువచ్చే పరిస్థితులు తీసుకురావాలన్నారు. వేదవతి ఆర్‌డిఎస్ ద్వారా సాగునీరు అందించే సదుపాయం కల్పించాలన్నారు. ఈనెల 12న తన జన్మదిన కార్యక్రమాన్ని జరుపుకోవడం లేదని, అదే రోజు నారా చంద్రబాబు నాయుడు నాలుగవసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా అమరావతికి వెళుతున్నట్లు తెలిపారు. తన జన్మదినం రోజు నాలుగవసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడాన్ని అదృష్టంగా భావిస్తూ, చిరస్థాయిగా జ్ఞాపకర్తగంగా నిలిచిపోతుందన్నారు. తన అభిమానులు సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ మల్లికార్జున ,బద్రి స్వామి,ఇస్మీ షేక్షావలి, మంజునాథ్, రంగ యాదవ్ ఉన్నారు.


మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

ఎమ్మిగనూరు లో జనసేన శ్రేణుల సంబరాలు

చల్లా వరుణ్ అధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు



ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి బిజెపి జనసేన ఉమ్మడి కూటమి అఖండ విజయం సాధించిన సందర్భంగా ఎమ్మిగనూరులో జనసేన పార్టీ నాయకుడు చల్లా వరుణ్ అధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం చల్లా వరుణ్ నాయకత్వంలో జనసేన నాయకులు కార్యకర్తలు స్కూటర్ ర్యాలీ చేపట్టారు. సోమప్ప సర్కిల్ నుండి వైఎస్ఆర్ సర్కిల్ , ఎంజి పెట్రోల్ బంక్, వ్యవసాయ మార్కెట్ సర్కిల్, శ్రీనివాస టాకీసు మీదుగా తిరిగి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సోమప్ప సర్కిల్ లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చల్లా వరుణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనపై విరక్తి చెంది కూటమిని గెలిపించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అధ్వర్యంలో 21 స్థానాలలో పోటీ చేసి 21 స్థానాలు గెలిచి 100 శాతం విజయం సాధించి చరిత్ర సృష్టించారు. దేశంలో 100 శాతం విజయం సాధించిన ఘనత జనసేనకు దక్కుతుందన్నారు. ఎమ్మిగనూరు లో ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మున్నా, గోరంట్ల, నవీన్, ఫణి, వలి, ఉదయ్, తరుణ్, రమేష్, నర్శప్ప పాల్గొన్నారు.

పేదల ఆస్తులను కబ్జా చేసిన వారిపై చర్యలు

ప్రజాశక్తి-ఆదోని

అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ మార్గంలో ఆస్తులను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జనసేన ఇన్చార్జి మల్లప్ప హెచ్చరించారు. ఆదివారం జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులు ఆగడాలు ఎదిరించడం వల్లనే ప్రజలు కూటమిని ఆదరించారని వారి రుణం తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలోనైనా,నియోజకవర్గంలోనైనా కూటమి నాయకుల సమిష్టితోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరుస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మల్లప్ప తెలిపారు. ఎన్నో త్యాగాలు, అవమానాలు సహించి ప్రజా శ్రేయస్సు కోరే నాయకుడు పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం, ఆయన అడుగుజాడల్లో నడుస్తామన్నారు. ఆదోనిలో ప్రజలు దుర్మార్గపు పాలనను గ్రహిస్తూ భయపడుతున్నట్లు నటిస్తూ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక ఓట్లు వేసి గెలిపించారన్నారు. టిడిపి సీనియర్ నాయకులు రామచంద్రప్ప శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశాన్ని దృష్టిలో ఉంచుకొని మల్లప్ప మాట్లాడారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మీనాక్షి నాయుడుతో కలిసి పలు విషయాలపై చర్చించినట్లు తెలిపారు. మీనాక్షి నాయుడుతో చర్చించగా గ్రామాల్లో వార్డులలో ఏ ఒక్క కార్యక్రమానికి సంబంధించి కార్యకర్తలకు హామీ ఇవ్వలేదని, టిడిపి, బిజెపి, జెఎస్‌పి కూటమి నాయకులతో చర్చించి లబ్ధి చేకూరే బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారన్నారు. ప్రజలు అపోహాలు నమ్మవద్దని, కూటమిలో భాగంగా ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశలో కూటమి అంతిమ లక్ష్యమన్నారు. ఎవరు కూడా అధైర్య పడవద్దన్నారు.రాజకీయ పార్టీలకు ఏ పార్టీ నాయకులు వచ్చినా, కార్యకర్తలు వచ్చినా సాదరంగా ఆహ్వానించడం పరిపాటుగా వస్తుందన్నారు. వైసిపి నాయకులు గాను కార్యకర్తలుగాను భావించకుండా ఆదోని ప్రజలు గానే పరిగణలోకి తీసుకుంటామన్నారు. కూటమిలో గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ పార్ధసారథికి ఆదోని అభివద్ధి పట్ల పక్క ప్రణాళికతో ఉన్నారని, ప్రజలు నమ్మే అత్యధిక మెజార్టీతో గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయబోమని చెప్పినట్లు గుర్తు చేశారు. సమావేశంలో రేణు వర్మ, రాజశేఖర్, చంద్రశేఖర్, రాజేశ్వరి, శీన, పులిరాజు, తాహేర్ వలి, శ్యాం, వెంకటేష్, శాంత, తరుణ్ తదితరులు ఉన్నారు.


సమా వేశంలో మాట్లాడుతున్న మల్లప్ప

బివి జయనాగేశ్వర్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి : మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి- నందవరం



మాజీ మంత్రివర్యులు కీర్తిశేషులు బివి మోహన్ రెడ్డి ఆశయ సాధనలో భాగంగా ఎమ్మిగనూరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే బివిజయ నాగేశ్వర్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా ఎమ్మిగనూరు నియోజకవర్గం నుండి బివి మోహన్ రెడ్డి ఐదు సార్లు మంత్రి పదవి చేపట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ఆయన అడుగుజాడల్లోనే నడుస్తుయాయన కుమారుడు బివిజెకు కూడా మంత్రి పదవి ఇస్తే, మళ్లీ ఎమ్మిగనూరు నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉంటుందన్నారు. బివి మోహన్ రెడ్డి, బివి జయ నాగేశ్వరరెడ్డి అధికారంలో ఉన్నప్పుడు నందవరం మండలం అభివృద్ధి పథంలో నడిపించారని, మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచారని, నందవరం మండలం అభివృద్ధి చెందుతున్నారు. మంత్రి పదవి ఇస్తే మండలం, తాలూకు, జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంలో నారా చంద్రబాబు నాయుడు జయ నాగేశ్వర్ రెడ్డి డిఎన్‌ఎలో తెలుగుదేశం రక్తం ప్రవహిస్తుందని, తన కుటుంబానికి ఎంతో ఆప్తులని చెప్పారన్నారు. అదేవిధంగా తండ్రి బివి మోహన్ రెడ్డి లాగే జయ నాగేశ్వర్ రెడ్డి కూడా చంద్రబాబు నాయుడు కుటుంబానికి ఎంతో నమ్మకమస్తమైన వ్యక్తి అని, ఎంతో వాక్చాతుర్యం, విద్యావంతుడు అయినా బివిజేకి మంత్రి పదవి ఇస్తే కర్నూలు జిల్లాలో ప్రతి ఒక్కరు కూడా హర్షిస్తారన్నారు.

చైర్మన్ పదవికి రాజీనామా

ప్రజాశక్తి-పెద్దకడబూరు



పెద్దకడబూరు గ్రామానికి చెందిన పి.భాగ్యమ్మ, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి ఆదివారం రాజీనామా చేశారు. వైసిపి ప్రభుత్వం కురువ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపిపి రఘురాం సతీమణి భాగ్యమ్మను ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. రాష్ట్రంలో వైపిపి ప్రభుత్వం పతనం కావడంతో ఆమె రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని పరిశ్రమలు , వాణిజ్య శాఖ కార్యదర్శికి పంపించారు. పదవీకాలంలో తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నీటి కుంటలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-హాలహర్వి

మండలం లోని నిట్రవట్టి గ్రామంలో నీటికుంటలో పడి మనోజ్ కుమార్ అనే బాలుడు(9) మృతి చెందాడు. తండ్రి మల్లికార్జున తల్లిమీనాక్షి మూడవ సంతానం అయిన మనోజ్ కుమార్ ఆడుకుంటూ ఊరు పక్కనే ఉన్న నీటికుంటలో పడి చనిపోయాడు. ఇంకా ఇతర పిల్లలు అఖిల,(13) సుమలత,(11).. ఆడపిల్లలు.. మగ పిల్లవాడు మనోజ్ కుమార్(9) ఒక్కడే ఉండడం వలన.. బాగా చూసుకునేవాళ్ళు అంతలో గుంతలో పడిన వెంటనే అక్కడున్న వాళు బయటికి తీశారు. కొన ఊపిరితో ఉన్న బాలుడిని తల్లిదండ్రులు ఆలూరు ప్రభుత్వాసుపత్రి తీసుకెళ్లే లోపు అప్పటికే చనిపోయారని డాక్టర్ లు చెప్పారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


బాలుడు ఫైల్

భజన కళాకారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-ఆదోని



ఆదోనిలోని శ్రీమంగళ ఆంజనేయ స్వామి దేవాలయంలో గత ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న భజన కళాకారులకు టైలర్ రమేష్, దేవస్థానం అధ్యక్షులు గౌడ్ ఈరన్న ఆదివారం శాలువలతో ఘనంగా సన్మానించారు. ప్రపంచంలో అన్ని అశాశ్వతమని దేవాలయాలు, కవులు, కళాకారుల సేవలు శాశ్వతమని వారు కొనియాడారు. సన్మానించిన వారిలో లలిత కళా సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ జి.నల్లారెడ్డి, కార్యదర్శులు హనుమాన్ సింగు, ఆంజనేయస్వామి దేవాలయం అధ్యక్షులు గౌడ్ ఈరన్న ఉపాధ్యక్షులు ఈరన్న ప్రముఖ సంగీత హార్మోనిస్ట్ ఉరుకుందప్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఓంకార్ గౌడ్, ఈరన్న, రమేష్, మల్లప్ప, కృష్ణ, లక్ష్మయ్య, నాగయ్య, రాముడు, రాము తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

-1981-82 ఏడాది చదివిన విద్యార్థులు ఒకే వేదికపై

-పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న స్నేహితులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు పట్టణం లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1981-1982 ఏడాదిలో 10వ తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థులు కలిశారు. పూర్వపు విద్యార్థులు వైష్ణవి డిగ్రీ కళాశాల చైర్మన్ జిడి.లింగప్ప , మల్లెల గ్రూప్ డైరెక్టర్ మల్లెల అల్ ఫ్రైడ్ రాజు అధ్వర్యంలో పూర్వపు విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గురువులకు నమస్కరించి సన్మానించారు. కొకరినొకరు ప్రేమగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాలలో స్థిరపడిన వారందరూ ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందని పూర్వపు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు మిట్ట శంకర్, మచాని శివశంకర్ , మచాని ఎర్రి స్వామి, గొల్ల శ్రీనివాస యాదవ్, ప్రకాష్ జైన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విరుపాక్షికి సన్మానం



ప్రజాశక్తి - దేవనకొండ

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిని మండల వైసిపి నాయకులు పాలకుర్తి హర్షవర్ధన్ రెడ్డి, హంపి రెడ్డి, తువ్వదొడ్డి మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, వైసిపి గౌరవ అధ్యక్షులు యూసుఫ్ బాష పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం దేవనకొండ లో జరిగిన ఓ వివాహ వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కిట్టు, వైసిపి కన్వీనర్ తపాల శ్రీనివాసులు, పలు గ్రామాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్షర యోధుడికి అశ్రు నివాళి

ప్రజాశక్తి-ఆస్పరి

రామోజీరావుమృతి తీరని లోటుఅని టిడిపి యువ నాయకులు సతీష్ కుమార్, మహేష్, వీరేష్, మరేష్ అన్నారు. టిడిపి ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు వెలుగు, అక్షర యోధుడు, తెలుగువారి ఆత్మబంధువు రామోజీరావు అని కొనియాడారు. ఆయన మన మధ్య లేకపోయినా ఆ మహనీయుడు ఇచ్చిన స్ఫూర్తి మార్గదర్శిగా మనల్ని ముందుకు నడిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వీరభద్రి,ఈశ్వర్, ఉషేను, శ్రీను పాల్గొన్నారు.

రామోజీరావు మృతి తెలుగు జాతికి తీరనిలోటు

మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది

ఈనాడు సంస్థ అధినేత పద్మవిభూషణ్ రామోజీరావు మృతి తెలుగు జాతికి తీరనిలోటు అని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఆస్పరిలోని సుద్దబావి ఏరియాలో మాల మహానాడు ఆధ్వర్యంలో సంతాప సభను ఏర్పాటు చేశారు. రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామోజీరావు తెలుగు జాతికి ఒక వెలుగు అని, నిరంకుశ పాలకులపై తన ఈనాడు పత్రిక, ఈటీవీ ద్వారా ప్రజలను చైతన్య పరిచారన్నారు. రామోజీరావు కష్టాన్ని నమ్ముకొని సుదీర్ఘ కాలంగా అనుబంధం వాటి పై వ్యతిరేక ఉద్యమాలకు నాయకత్వం వహించి రామోజీరావు ప్రజలకు దిశానిర్దేశం చేశారన్నారు. రామోజీరావు ప్రత్యేక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా లక్షలాది మందికి ప్రజలకు జీవనోపాధి కల్పిస్తున్నారన్నారు. ఈ టివి,ఈనాడు, రైతువాణి, అన్నదాత తదితర వాటిని ఏర్పాటు చేసిన ఆయన జీవితం ఈనాటి యువతకు, రైతులకు ఆదర్శంగా నిలిచారన్నారు. తెలుగు జాతి ఉన్నంతవరకు రామోజీరావు పేరు చిరస్థాయిగా నిలిచి పోతుందనీకొనియాడారు. ఈ కార్యక్రమంలో దినేష్, శివకృష్ణ, రంజిత్, అజయ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



జయనాగేశ్వర రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

-టిడిపి పట్టణ మైనారిటీ నాయకుడు బందనవాజ్

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

2024 సాదారణ ఎన్నికలలో ఎమ్మిగనూరు నుండి 2వ సారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన బివి జయనాగే శ్వర రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి గౌరవించాలని ఎమ్మిగనూరు పట్టణ టిడిపి ముస్లిం మైనారిటీ నాయకులు బందనవాజ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక లింగాపురం రామయ్య ఏరియాలో మీడియా తో మాట్లాడారు. ఎమ్మిగనూరు నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో నడిపిన మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళుతున్న ఆయన తనయుడు బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రజలకు అందుబాటులో అంటూ నిత్యం ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పని చేస్తున్నారు.



కరాటే పోటీలను ప్రారంభించిన శమంతకమణి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు యునైటెడ్ క్లబ్ లో మాస్టర్ ఆరిఫ్ హుస్సేన్ అధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లా కరాటే పోటీలను మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శమంతకమణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కరాటే ప్రతిరోజు సాధన చేయడం వలన శరీర ధృఢత్వం పెరిగి మానసిక వికాసం కలుగుతుందని, విద్యార్థులు చురుగ్గా ఉంటారని అన్నారు.

మాజీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సయ్యద్ ఖాళీద్, మాజీ డిఎస్‌పి హుస్సేన్ పీరా మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి ఆరిఫ్ మాస్టర్ కరాటేలో శిక్షణ ఇస్తూ విద్యార్థులకు జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా తీర్చిదిద్దారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రాండ్ మాస్టర్ ఆరిఫ్ హుస్సేన్ తెలిపారు.